



# అసురసంధ్య

లల్లాదేవి

కుమారీ! గడచివచ్చిన దారి రవంత అయినా లేదు. అప్పుడే యింతగా అలసినావేమి? కుసుమపేశలమయిన నీ మృదుల పాదాలు అపుడే వసివాడుతున్నాయి. నిన్నింతగా నొప్పించిన వృద్ధుడు క్షంతవ్యుడు'' అన్నాడతడు. ఆమె తలదించి తన పాదాలవంక చూచుకుంది. అవి కింసుక పుష్పాలవలె అయినాయి. నిన్న మొన్నటిదాకా పసిదనమే రూపెత్తినట్లున్న ఆమె నిప్పుడు యౌవనపు పసదనాలు ఆక్రమించినాయి.

ఆమె సువిశాల సుందర నయనాంచలాలు వజ్రాలలో తాపిన ఇంద్ర నీలాలను తలపింపచేస్తున్నాయి. పెదవులు పద్మరాగ వర్ణంలో తరళాయిత మవుతున్నాయి. పలువరుస మంచిముత్యాల వేరులా బారులు తీరింది.

చెంపలు యౌవనపు నిగారింపుతో బద్దారినాయి. మందార పూరేకులు చిదిమి చిత్రీకరించినట్లున్న చెంపలు! వికసిత సహస్రదళ పద్మంలా ఉన్న మోము.

తలమీదినించి జారిన ముంగురులు వికసితరాజీవాన్ని ఆశించి, ఆశ్రయించి సభ తీర్చిన తుమ్మెదల బారులా అన్పిస్తోంది. అందాలన్నీ ఆ ముద్దుగుమ్మనే ఆశ్రయించినట్లున్నాయి.

మార్గాయాసం కావటంనించి ముఖం రవంత నల్లనవుతోంది. కనురెప్పలు అలసటతో వ్రాలుతున్నాయి.

తండ్రి మార్గాయాసం గురించి ప్రస్తావించగానే ఉన్నచోటున నిలిచిపోయిందామె. ఆయాసంనించి వక్షస్సు ఎగసి ఎగసి పడుతోంది.

"తండ్రీ నేనింక ముందుకు సాగిరాలేను. మీరు రవంతసేపు ఈ వృక్షఛ్చాయ నాశ్రయించి అలసట తీర్చుకొనండి. ఎక్కడయినా జలధారలను అన్వేషించి దాహశాంతి కావించుకొనండి. నే నిలా అంటున్నది నా కోసమని భావించకండి. నా ఆలోచన మీగురించి మాత్రమే.

మీరు వృద్ధులయినారు. శరీరంలో జవసత్వా లుడుగుతున్నాయని నాకుతెలియదా? కాలం నిర్ణయించే ధర్మాలను అనుసరించి మీ శరీర శక్తులువెనుక తట్టుపట్టినాయి.

ఎందుకు వచ్చిన ప్రయాణమిది? ఈవయసున ఇంతప్రయాసకు ఓర్చి ఈపయనం చేయకున్న ఏమికాగలదు?'' అని ప్రశ్నించింది. కుమార్తె.

ఆమాటలు తండ్రికి నవ్వుతెప్పించినాయి.

"అమ్మా! కైకసీ! నేను కొన్నిదశాబ్దాలుగా నాగభూములలో (దండకారణ్యం దక్షిణంగా దూరప్రాంతాలు) తలదాచుకున్నది నీకు తెలియదా?

ఇప్పుడాచోటు వదలి ఎగువ భారతభూములకు ఎక్కివచ్చే కారణమే నీకు తెలియదుతల్లీ! ఇది నాచివరిప్రయాణం!

ఈ పయనంలో నా ఆశయసాధన సంపూర్తి అయితే నాకు మనశ్శాంతి చేకూరకలదు. మండేకొలిమిలా రగులుతున్న మనోవ్యధను బహుకాలం భరించినాను తల్లీ!

ఇపుడు సమయం ఆసన్నమయింది. నా బ్రతుకు అర్థాలు నేను మనోగతంగా పదిలపరుచుకున్న ఆశయాలు నీనించి నెరవేరనున్నాయి తల్లీ! అందుకే అధిక ప్రయాస అయినా ఈపయనం అనివార్యం అని సమాధానం చెప్పాడుఅతడు. కైకసి ఆలోచనలో పడింది.

ఆమె సువిశాల సుందరనయనాలు అర్ధనిమీలితాలై రెప్పల మాటుకి ఒదుగుతున్నాయి. కుమార్తెలో ఆలోచనలు అంకురించినాయని గమనించినాడు తండ్రి.

అతడి పేరు సుమాలి.

జరాభారంతో కృంగి వొంగిపోతున్న శరీరమాతనిది. బహు వర్షాల అనుభవాలతో పండిపలితమయిన కేశపాశాలను కలబందనారతో కట్టడి చేసుకున్నాడు.

చూపులు సూక్ష్మీకరింపబడి ఉన్నాయి. నుదుటిమీద అమరిక అయిన మూడుముడుతలమధ్యఅనుభవాలు అగాధాలవలెకన్పిస్తున్నాయి. రెప్పలు జ్ఞాపకాల బరువుతో అవనతం అవుతున్నాయి. కాలమనే ఆమోఘమైనశక్తి శరీరాన్ని శక్తిహీనంగామార్చి నా మనసు మాత్రం మామూలుగా ఉన్నదని పిస్తోంది.

"తండ్రీ! ఉజ్వలమై స్ఫూర్తినిండిన మీ మాటలు ఒకఅపురూపమయిన ఆశయానికి అంకితమయినారన్న అంశాన్ని నిరూపిస్తున్నాయి. అదేమిటో తెలుసుకునేందుకు మీ తనయనైన నేను తగుదాననుకానా?" అని అడిగిందామె. ఆ కంఠస్వరం ఎంతో ఆసక్తితోను శ్రద్ధాపూర్వకంగానూ ధ్వనిస్తోంది. తండ్రి అయిన సుమాలి రవంత కన్ను మొగిచాడు. ఏ అంశాన్ని తన జీవితాశయంగా మలచుకుని దానికి అంకితమై ఇంతకాలం బురదనేలల్లో బ్రతుకువెళ్ళదీశాడో ఆ అంశాన్ని కుమారికి నివేదించవలసిన సుముహూర్తం ఇప్పుడాసన్నమయింది. అది ఆయనకి అనిర్వచనీయమైన ఆనందం కలిగిస్తోంది.

ఈ కుమారివల్లనే తన ఆశయం నెరవేరాలి. తనకు జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోవాలి. తనజాతికి జరిగిన అన్యాయానికి తగిన సమాధానం చెప్పితీరాలి. అందుకు తానురూపొందించిన క్షేత్రమే ఈ కైకసి!

ఇంక యిప్పుడామెకు అన్ని సంగతులూచెప్పి మానసికంగా ఆమెను ఈ చారిత్రక సమరానికి సమాయత్తురాలిని చేయాలి.

అతడు ఒక వృక్షచ్ఛాయకు కుమారి సుకుమారి అయిన కైకసిని నడిపించాడు.

అతని కనులముందు గతం కదులాడుతోంది. ఆతనిముఖంమీద నీలినీడలు తారాడుతున్నాయి. చెప్పవలసినది ప్రారంభించాడు.

కైకసి శ్రద్ధాళువు అయి తండ్రి మాటలు వినసాగింది. ఆమెకు తండ్రి ఒక్కడే గురువు.

"అమ్మా! నా మనసుని గాయపరచిన ఈ అనుభవం నాకు ఎదురు అయి బహుకాలమయింది. నా మనసులో మండిన మంటల్ని కాలం చల్లార్చలేదు.

ఒకప్పుడు మనజాతి ఈ ఎగువప్రాంతాలలో నిశ్చింతగా కాలం వెళ్ళమార్చేది. వ్యవసాయం, వేట, వృత్తులుగా, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు మా ఊపిరులుగా జీవించేవాళ్ళం

అప్పట్లోమాకు దండకారణ్యం ఆవల ఉన్నయావత్తూ జంబూ ద్వీపంలోనూ ఎవరూ విరోధులులేరు. కాని హిమావర్తం ప్రాంతాలలోని భూమిపతులు దండకారణ్యందాకా విస్తరించారు.

అదికారణంగా వారితోమాకు వైరం ప్రాప్తమయింది. నేను మనజాతికి నాయకత్వం వహించినానుతల్లీ! వారందరినీ పారద్రోలినాను

ఆర్యావర్తపు రాజులకు అది అవమానమయింది. వారంతా హిమావర్తమనే మంచుమల ప్రాంతాలలో ఉన్నరాజులను అండదండల కోసం ఆశ్రయించారు.

వారిలో పరాజయమన్నది ఎరుగని సర్వశక్తి సంపన్నుడయిన విష్ణువు వారికి అభయమిచ్చినాడు. ఆతడు నామీదికి దండెత్తి వచ్చాడు.

నేను దండకారణ్యానికి దిగువున దూరప్రాంతాలలో ఉన్ననా భూమికి తరిమివేయబడినాను. అది మొదలుగా నాలో ప్రతీకార జ్వాలలు రగిలినాయి. ఇప్పుడు సమయం ఆసన్నమయింది.

అందుకే నిన్ను తోడ్కొని వచ్చాను" అంటూ తనలో రగులుతున్న ప్రతీకార వాంఛకు కారణం వివరించినాడు సుమాలి. అధికంగా కలిగిన ఆయాసం నించి రవంత స్వస్థుడయేందుకు మాట్లాడడం ఆ వేశాడు.

"తండ్రీ! నాకు మీరు యుద్ధకళ నేర్పించలేదు. వీర విద్యలలో నైపుణ్యం నాకు లేదు. మీకు కలిగిన తలవొంపుకూ, మన జాతికి కలిగిన నష్టానికి ప్రతీకారం నే నెలా తీర్చగలను" అని అడిగింది కైకసి.

సుమాలి ఆమెకు కర్తవ్యం బోధించాడు.

"అమ్మా ! ఆర్యావర్తపు రాజులంతా యుద్ధ విద్యా విశారదులు వారికి విజ్ఞానముంది. వేదాలున్నాయి. అవి మనకు లేవు. అందునిం మన సంతతి వారి చేతిలో పరాభూతమవుతోంది.

దీనికి నేనొక ప్రతి క్రియను ఆలోచించాను. వేద విదులైన మౌనులు ఈ నిర్జనమయిన దండకారణ్య ప్రాంతాలలో తిరిగాడు తుంటారు. వారినించి వేద ప్రభావితమైన బీజాలను మన క్షేత్రాల లోకి తీసుకురావాలి.

అప్పుడు మనలో ఆర్యావర్తపు రాజులను జయించ గలిగిన ఉద్ధతుడు జన్మిస్తాడు. మనకు జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చు కునేందుకు యింతకుమించిన మంచి దారిలేదు" అని చెప్పాడు సుమాలి.

సుకుమారి అయిన కైకసి తండ్రి ఆశయ సాధనకు క్షేత్ర వతి అయిన తాను వేదిక అయేందుకు మనసా వాచా కర్మణా సంసిద్ధరాలు అయింది.

"అలాగే నాన్నగారూ !" అంది తల దింపుకుని.

* * *

అది పులస్త్యుని కుమారుడయిన విశ్రవసు పర్ణశాల ! అది సుందర నందనవనమే! అందాల బృందావనమే! ప్రశాంతత ఆ చోటనే పుట్టింది.

అతడు సుందరుడు, శాంతుడు; విజ్ఞానపు వెలుగుతో తరళించే నేత్రాలు ఆ మూర్తివి. పద్మాసనంవేసి భృకుటిలో చూపు లగ్నంచేసి నాదంటే దివ్య లోకాలను దర్శించగల పవిత్ర మూర్తి అతడు. తేజోబిందువులు, జ్ఞాన బిందువులు ఆతని మనసు వాకిళ్ళముంగిటనే తారాడుతుంటాయి.

ఆ పవిత్రమూర్తి ఆశ్రమ ప్రాంగణంలోకి ప్రవేశించినారు కుమారి కైకసి, తండ్రి సుమాలి.

రుచిరమైన చిరునవ్వులు చిలకరిస్తూ అమృతం పంచియిచ్చేం దుకు అమరులను మోహిని ఆహ్వానించినట్లుగా ఆహ్వానించాడు విశ్రవసు.

అతిథి మర్యాదలు కావించాడు.

"మా వల్ల మీ కేదైనా మేలు జరిగితే అది మోక్షప్రాప్తిగా భావించగలను" అన్నా డాయన. సంస్కార పూర్ణమయిన వారి అతి థేయ మర్యాదలకు అచ్చెరువు పడినాడు సుమాలి. మౌని మాటలు అమృత వాహిను లనిపించినాయి.

"జటధారీ ! నీ గురించి నే నెరుగుదును. నీవు పౌలస్త్యుడవు. వయసున నాకన్న పిన్నవాడవు. అయినా ఉజ్వలమైన మాటలు, సంస్కార పూర్ణమైన నీ ఆతిథేయ మర్యాదలు నీవు బుద్ధిలో పెద్ద వాడవని తేటతెల్లం చేస్తున్నాయి.

కార్యార్థినై నేను మీ దగ్గరకు వచ్చాను. నిరాశతో త్రిప్పి వంపివేయరని కొండంత ఆశ. అయితే మీకు మునుముందుగా చెప్పు కోవలసిన సంగతులు కొన్ని ఉన్నాయి" అంటూ ప్రారంభించాడు సుమాలి.

పులస్త్య బ్రహ్మతనూ భవుడైన విశ్రవసు అతని మాటలకు మధ్యలోనే అడ్డు వచ్చాడు.

"ఓయీ! నీవు అసుర గణాలకు అధ్యక్షుడవనినాకు తెలుసు. ఒకప్పుడు మా సురగణపతి అయిన విష్ణువు హిమావర్తం నించి వచ్చి నిన్ను నాగలోకమని పిలువబడుతున్న దిగువ భారతభూములకు పారద్రోలిన సంగతి కూడా నే నెరుగుదును.

విష్ణువు హిమా వర్తానికి ఏలిక ఒక్కడే కాదు, అతడు అర్యా వర్తంలోని రాజులందరికీ ఆరాధ్య దైవము. అతడు సర్వవ్యాపి. ఘటనా ఘటన సమర్థుడు. ఇచ్చేందుకైనా పుచ్చుకునేందుకైనా చాలిన వాడు. అట్టివాడు అతడొక్కడే కాని మరొకడు లేడు.

అందునించి అతని సంకల్పాలే సురగణాలకు ఆర్యావర్తపు యావన్మంది రాజులకూ శిరోధార్యాలు, అసురగణాలకు అధిపతివైన నీకు అతనివల్ల సంప్రాప్తమైనది పరాజయమేనని నాకు తెలుసు.

అతనికి ఎదురొడ్డి నిలువగలిగిన వారు చతుర్దశ భువనాలలో ఎవరూ లేరు. అతని సంకల్పమే జనులందరి భవితవ్యాలను నిర్ణ యిస్తుంది.

అందునించి అతని చేతిలో అసురగణాలకు అధ్యక్షుడవయిన నీ ఓటమి అనివార్యమయింది.

కాగా నీ విప్పుడు నీ కుమారితో యిక్కడ మునివాటికకు వచ్చిన కారణమేమిటో చెప్పగలవా ? సాయమేదైనా నాకు చేయగలిగి నది చేయదగినది అయితే తప్పక చేస్తాను." అని సంభాషించి నాడు విశ్రవసు.

ఆతడు చేసిన విష్ణుస్తుతి అసురగణాల అధ్యక్షుడయిన సుమా లికి కర్ణహితవు కలిగించలేదు. అయినప్పటికీ తాను కార్యార్థి ! ఈ విషయాన్ని స్మరించి మనసును దిటవు పరుచుకున్నాడు సుమాలి.

ప్రస్తుతానికి వచ్చాడు.

"తేజోమూర్తీ ! నీవు గతమంతా తెలిసికొన్న వాడవు. ప్రస్తు తాన్ని పరిశీలించగల వాడవు. భవితవ్యాన్ని శాంతదృష్టితో వీక్షించ గలవాడవు.

అందునించి త్రికాలవేత్తవు.

కనుక నా కోరిక తప్పించి మరొక మాట చెప్పాలన్న ఆశ నాకు లేదు. ఈ సుకుమారి నా కుమారి.

పేరు కైకసి. యౌవనాంకురమై మాతృమూర్తి కాదగు అర్హత లన్నింటినీ సంతరించుకున్నదీమె. అట్టి స్థితికి వచ్చిన ఆడదాయికి ఆలంబన కల్పించటం కన్న తండ్రి నయిన నాకు కర్తవ్యం కదా!

ఆ పని ఈడేర్చుకుందుకే తేజోమూర్తి వయిన నిన్ను ఆశ్రయించినాను మౌనీ! అసురగణాలను అనుగ్రహించు క్షేత్రవతి అయిన ఈ కైకసికి సురగణశక్తి సమన్వితమయిన బీజాన్ని ప్రసాదించు.

మాతృత్వమనే మహనీయమయిన అర్థం ఆమె బ్రతుకులో నీ వల్లనే లభించాలి.

అసురుల శక్తిసంపన్నతకూ, సురగణాల మేధాసంపన్నతకూ ఉమ్మడివారసుడయిన ఒక ఉద్ధతుడు ఆమె గర్భవాసాన జన్మించాలి.

నా మనుమడు మహత్తరశక్తి సంపన్నుడు కావాలి. ఈ ఆశయ సాధనకోసమే బహుదూరం ప్రయాసపడి వచ్చినాను. నా కుమారిని అనుగ్రహించు'' అంటూ చేతులు ముకుళించాడు సుమాలి.

కైకసితండ్రి మనోగతాలకు అనుకూలవతిగా విశ్రవసు పాదాలను ఆశ్రయించింది. అతడు అర్థనిమీలిత లోచనుడయినాడు. అంతర్యపు పుటలలో ముద్రితాలయిన విప్లవిలాసాలను ఒక్కసారి స్మరించినాడు.

తృటిలో స్థిరసంకల్పుడై ఒక నిశ్చయమునకు వచ్చినాడు. కాంతిపుంజాలవంటి కనులు తిరిగి విచ్చుకున్నాయి.

"ఓయీ! అసురగణ అధ్యక్షా! నీ కోరిక అనుచితమైనది కాదు. స్వజాతీయుల ఆత్మ గౌరవ పరిరక్షణకై ఒక ఉద్ధతుడు జన్మించాలన్న ఆకాంక్ష మహనీయమైనది.

అందుకు యుద్ధవిద్యావిశారదులు, వేదవిదులు అయిన మా వంటి వారిని ఆశ్రయించటమే మేధాసంపన్నతకు గీటురాయి.

నీ ఆశయం నెరవేరుతుంది.

సుకుమారి అయిన నీ కుమారిని, ఈ కైకసిని పుత్రవతిని చేస్తాను. ఈ క్షేత్రవతి నావల్లనే మాతృమూర్తి కాగలదు, ఇదే నేను నిరూపించదలచిన ఆతిథేయ సంస్కారం'' అని ప్రవచించినాడు విశ్రవసు.

సుమాలి అంతర్యం ఆనంద రసార్ద్రవమైపోయింది. అతనికి సుదూరంగా ఆశాజ్యోతులు తరళాయిత మవుతూకన్పించినాయి. రవంత అయినా సంశయించక కైకసిని అతని పరంగా అర్పించి తన ఆవాసాలకు తిరుగు ప్రయాణమైనాడతడు.

కైకసి సిగ్గుల మొగ్గ అయింది.

ఋతువులు గతించినాయి. కైకసి తన వాడయిన మహాపుడు విశ్రవసును అంతర్యమంతా అర్పించి ఆరాధించసాగింది.

"కైకసీ! ఓ రాక్షసీ! నా ప్రేయసీ! ఉద్ధతుడ పుత్రుడు ఉదయించాలన్న మహదాకాంక్షతో నన్ను నీ పురుషు ఎన్నుకొన్నావు.

క్షేత్రవతులు పుత్రవతులు అయేందుకు పురుషుని ఆశ్రయి టమే కదా ప్రకృతి నిర్దేశం, కాని మన కలయిక విశిష్టమయినది.

మన శరీరాలు ఏకమై మనసులు ముద్దాడుకొని, ఆత్మలు ఏ సంధానమయిన మంచి ఘడియలే రానున్నాయి. అవే సురులకూ అ రులకూ అతీతమయిన సంకీర్ణజాతి పురుషుని ప్రాదుర్భావానికి సువ ముహూర్తం కాగలదు.

నీ తండ్రి కోరిక మేరకు నా నిగ్రహాన్ని సడలించుకున్నాను. ఆ సూర్యనారాయణుడూ, గాలీ, నీరూ, నింగీ, నే మనకు సాక్షులు. జలనిధులే వస్త్రాలుగా, గిరిశిఖరాలే మణిమకు లుగా ధరించిన భూమాత మనకు శృంగార శయ్య కాగలదు.

సిగ్గుపడతావెందుకు సుకుమారీ!

స్త్రీపురుషుల యోగోద్భవమయినదే కదా ఈ సృష్టి యావత్తు సంశయించక ఈ చేయి అందుకో!" అంటూ బాహువులను ముందుకు చాచినాడు విశ్రవసు.

అతని దండచేయి ఆమె తలదిండు అయింది. ముగ్ధకుసుమంల ఉన్న ఆమె అంతర్లోకం వికసితమయింది.

అతని నీడ ఆమె ఆశలజాడ అయింది. కాలం కమనీయమై కరగిపోయింది. ఋతువులు గతినిలిచిపోయినట్లుగా అన్పించసాగింది

అతడు మహనీయుడు. అతని ప్రేయసి చెంపలపై రచయించుకున్న మకరికా పత్రాలే ప్రేమపత్రాలయినాయి.

"ఓయీ! మహాపురుషుడా! అసురకాంతనయిన నన్ను నీ స్పర్శతో తన్మయురాలని చేసివేసావు. ఆడబ్రతుకులోని అర్థాలన్నీ ఏ మహనీయమయిన కాంక్ష వెనుక దాగుంటాయో, నా తండ్రిఅయిన సుమాలి ఏ ఆశతో నన్ను పెంచి నీకు అర్పించినాడో ఆ అర్థాలన్నీ ఇప్పుడు నెరవేరినాయి. ఈ ఆడపుట్టుక చరితార్థమయింది.

ఋతుమతిని అయిన నన్ను ఋతమతివి అయిన నీవు స్పృశించినావు. క్షేత్రవతిని అయిన నన్ను సంతానవతిగా అనుగ్రహించినావు. నా పుత్రుడు చతుర్దశ భువనాలకు అదత్ప్రాయుడై జన్మించాలని ఆశీర్వదించవయ్యా! అతడు అమేయ శక్తిశాలి కావాలి.

సురగణాలకు అతని పేరు సింహస్వప్నం కావాలి. నా తండ్రి కన్న స్వప్నాలు ఫలించాలి అన్నదామె.

తన ఊరువులపై తల ఆన్చుకుని సమస్త భూఖండమూ తనదే అయినంతగా తృప్తి మూర్తీభవించినట్లున్న ఆమెను అవలోకగా చూచినాడు మౌని.

"ఇదికదా దైవనిర్ణయము." అని సంభావించినాడు.

"ఓ రాక్షసీ! నా ప్రేయసీ! సురగణాల ఆధిక్యతను అవసానం చేసేందుకు సంకల్పించిన అసురగణాల ఆశయం నెరవేరుతుంది. సురాసురగణాల సంకీర్ణబీజం నీలో ప్రాణంపోసుకున్నది కదా! దైవ ఘటనలు ఇలానే ఉంటాయి.

సంకీర్ణజాతుడయిన మహాపురుషుడు ఉదయించే యజ్ఞంలో నీవూ నేనూ నిమిత్తమాత్రులమే! ఈ యజ్ఞంలో ఒక సమిధగా నా తపశ్శక్తిని యావత్తూ ధారపోశాను. నీవు ఉద్ధతుడయిన మహాపురుషునికి తల్లివికానున్నావు. నీ జన్మ ఈ ఘటనతో చరితార్థమయింది."అని చెప్పాడు విశ్రవసు. కైకసి తీరని అనురాగంతో, తృప్తి లభించని కాముకంతో అతని చుట్టూ చేతులు పెనవేసింది.

ముక్తికాంత పొందుకోరి మౌనిగా మారిన విశ్రవసు అసురకాంత బాహువల్లరిలో బంధితుడు అయినాడు.

కాలం ఒక ఉద్విగ్నతలో, ఒకస్ఫూర్తిలో, కరిగి జారిపోయింది. దివారాత్రాలు దోబూచులాడినాయి. అమృతమయుడయిన సుధాకరుని వృద్ధిక్షయాలు వరుసగా నడచినాయి.

మలయ సమీరాల ఆశ్వాసనతో ఆయాసం రవంత ఉపశమించగా పూర్ణగర్భిణి అయింది అసురగణకాంత కైకసి. ప్రకృతి ఆమెకు విముక్తి కలిగించే మధురక్షణాలు ఆసన్నమయినాయి. కలల కడలిలో ఓలలాడిందామె.

ఇదివిన్న సురులతాలూకు జనగణమనః కేదారాలలో - అగ్నిహోత్రం భగ్గున ఎగసింది. వర్ణాలు సంకీర్ణమయినాయి, విశ్రవసు మందహాసం చేశాడు.

"ఇది దైవసంకల్పమేకదా! ఆర్యావర్తపు రాజులయినా, హిమావర్తపు సురగణాలయినా దైవఘటనను ప్రతిఘటించలేవుకదా!" అని సంభావించాడు మౌని. వారి కన్నెర్రకు కించిత్తు అయినా చలించలేదు.

దిగువ భారతభూముల్లో ఆవాసముంటున్న యక్షరాక్షసగణాలు అతనిని ఆరాధించినాయి.

పండిన పండుకు తల్లిచెట్టు నుండి తొడిమవూడిపోవటం ప్రకృతి నిర్ణయమేకదా! కైకసికి నొప్పులు ప్రారంభమైనాయి.

అసుర జనగణ మనః కేదారాలు ఆనంద తరంగిణులయినాయి. అత్యంతాసక్తితో ఫలితాంశమయిన పసివానికోసం ఎదురు చూడసాగినారు వారు,

పురుటి నొప్పులతో కైకసి కలతపడింది. ఆమె భౌతికశరీరలోని రక్త, అస్థి, మజ్జా, ఓజస్సులు బాధాపరితప్తాలయినాయి.

అసురకాంత తప్తకాంచన మయింది.

పగలంతా గడచిపోయింది. యామిని కురులార్చుకునేందుకు సంసిద్ధురాలు అవుతుంది. అది సధ్యాసమయం. కైకసి మాతృత్వం కోసం బిడ్డను బయటపెట్టేందుకు స్వశరీరంతో పోరాడుతోంది. నొప్పులు మరింత అధికమయినాయి. రక్తం గడ్డకట్టినట్లుగా అయింది.

కడసారిగా కెవ్వుమని కూపెట్టింది కైకసి. దిగంతాలు తృళ్ళింతలయినాయి.

అసురగణాలు అచ్చెరువువడి చూడసాగినాయి. ఆసక్తితో ఆశతో తలమునక లవుతున్నాయి.

విశ్రవసు మందస్మితం కావించి అర్థ నిమీలిత నేత్రుడయినాడు

ఇందరు మహామహులకు ఆసక్తినీ, ఆశలను భయాలనూ రేకెత్తించిన మహోద్దండుడయిన ఆ బాలకుడు తల్లికడుపును కసిగా చీల్చుకుని విముక్తికోసం తలబయటకు పెట్టాడు.

ఉద్ధతుడయిన ఆ బాలకుడు అత్యంతశక్తితో మాతృకోశాన్ని చివ్వున చీల్చుకుని బయటపడ్డాడు.

అది దివారాత్రాల సంధ్యాసమయం. సాయంత్రత సంధ్య. పుడమి తల్లి ఒడిలో పడగానే కెవ్వున అరిచాడు బాలకుడు. ఆ రోదన ధ్వనికి ఆడవి జంతువులుసైతం భ్రమించినాయి.

ఆరోదన ధ్వనిలో అసురవేదం విప్లవించింది. ఆరోదన ధ్వనిలో వేదవిధులయిన సురలకుగుండెలు అవిసినాయి. నక్కలు ఊళవేశాయి. ఉలికిపడిన నెమళ్ళు క్రీంకరించినాయి.

అడవి గుర్రాలు హయహేషలు చేసినాయి.

ఉచ్చమయిన ఆరోదనధ్వనికి ఉలికిపడి ధ్యానం ముగించినాడు. విశ్రవసు.

"ఈతనికి దశకంఠములున్నవా ఏమి? లేకున్న ఆ ఎలుగెక్కడిది? అని చకితుడయినాడు.

అవును ఈతడు దశకంఠుడే! అన్నాడు.

ఉద్ధతుడయిన ఆ బాలకుడే దశకంఠుడయినాడు. సురాసుర సంకీర్ణ పురుషుడై దిగంతాలను సైతం గడగడ లాడించాడు.

ఆ తరువాత కైలాసగిరిని పెకలించి ఈశ్వరాను గ్రహంతో రావణుడయినాడు.

అసురజనగణ మనోభిరాముడయిన దశకంఠుని చూచి మురిసిపోయింది మాతృమూర్తి కైకసి.

ఆ సంధ్య అసురసంధ్య అయింది.

అది మొదలు సాయంత్రత సంధ్య "అసురసంధ్య !"